క్లుప్తంగా

కుమారస్వామికి విశేషపూజలు


కుమారస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్ల ఆలయ ప్రాంగణంలోని కుమార స్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమార స్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

మహానందిలో డీపీఓ పూజలు


డీపీఓ లలితాబాయికి మెమొంటో అందిస్తున్న ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో డీపీఓ లలితాబాయి పూజలు నిర్వహించారు. మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చిన డీపీఓకు ఆలయ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య స్వాగతం పలికారు. కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను ఆమె దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. దర్శనం అనంతరం వేదపండితులు ఆశీర్వచనం చేయగా టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య మెమొంటో అందించి సత్కరించారు.

నందీశ్వరునికి ప్రత్యేక పూజలు


శనగల బసవన్నకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలోని స్వామి అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైలక్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలువీరభద్ర స్వామికి మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేషపూజలు నిర్వహించారు. ప్రదోషకాల సమయంలో వీరభద్రునికి, నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలు నిర్వహించారు. ఆరంభ పూజల్లో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు. నందీశ్వర స్వామికి నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను, క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.

కలప వేలాలకు స్పందన కరువు


వేలాలు నిర్వహిస్తున్న అధికారులు

మహానంది: గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలోని అటవీ కలప డిపోలో మంగళవారం నిర్వహించిన కలప, కర్రల వేలాలకు స్పందన కరువైంది. నంద్యాల ఇన్‌చార్జ్ డీఎఫ్ఓ శ్రీనివాస రెడ్డి, ఎఫ్ఆర్ఓ నాసిర్‌ఝూ బహిరంగ వేలాలు నిర్వహించారు. పాత వెదురు, బ్యార్నీ కర్రల ధరలు అధికంగా ఉండటంతో బనగానపల్లి నుంచి వచ్చిన రైతులు కొనేందుకు ఆసక్తి చూపలేదు. 12 లాట్లలోని కలపకు నిర్వహించిన వేలాల ద్వారా రూ.1,27,350 ఆదాయం వచ్చినట్లు సబ్ డీఎఫ్ఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. అలాగే ఆయన డిపోలోని రికార్డులు పరిశీలించి ఎఫ్ఆర్ఓకు పలు సూచనలు చేశారు.

రైతులపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

పాములపాడు: రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని ఏపీ జిల్లా రైతు సంఘం కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యక్షుడు రామేశ్వరరావు కోరారు. మంగళవారం స్థానిక నెమలి వెంకట రెడ్డి సుదర్శనం భవనంలో జిల్లా రైతు సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందస్తు వర్షాలు కురుస్తున్నందున రైతులకు సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వర రావు, ఆత్మకూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు మాబాషా, వీరన్న, బేతంచెర్ల రామ్మోహన్, జిల్లా నాయకులు సంజీవరాయుడు, ప్రసాద్, దాసు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీకి యత్నం

ఆత్మకూరురూరల్: మండలంలోని నల్లకాల్వ గ్రామంలో సోమవారం రాత్రి ఒక ఇంటి ముందు పార్క్ చేసి ఉంచిన ద్విచక్ర వాహనం చోరీ యత్నం జరిగింది. ధనలక్ష్మి తన ఇంటి ముందు పార్క్ చేసి ఉంచిన వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించగా సైడ్ లాక్ రాక పోవడంతో వాహనంలోని 4లీటర్ల పెట్రోలును, బ్యాటరీని తీసుకెళ్లారు. రెండు చక్రాలను విప్పే ప్రయత్నంలో ఉండగా అలికిడికి ఇంట్లో వాళ్లు లేచి బయటకు రావడంతో అక్కడి నుంచి పరారైనట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆదాయం ఉన్నా..

అభివృద్ధి సున్నా!

- తర్తూరు శ్రీరంగనాథ స్వామికి ఏటా రూ.లక్షల్లో ఆదాయం
- చిన్నపాటి వర్షానికే వెలుస్తున్న ఆలయం
- మరుగుదొడ్లు లేక భక్తుల ఇక్కట్లు
- ఎండకు ఎండుతూ వానకు తడుస్తున్న రథం

జూపాడుబంగ్లా: రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎంతో పేరొందిన తర్తూరు లక్ష్మీరంగనాథ స్వామి ఆలయానికి ఏటా రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నా.. అభివృద్ధి చేయడంలో నిర్వాహకులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఫలితంగా మౌలిక వసతులు లేక దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆలయం నిర్మించినప్పటి నుంచి ఇప్పటిదాకా ఎలాంటి మరమ్మతులు చేసిన దాఖలాల్లేవు. దీంతో స్వామివారి ఆలయ గాలిగోపురం ముందుభాగం శిథిలమై కడ్డీలు బయటపడ్డాయి. చిన్నపాటి వర్షం కురిసినా ఆలయం వెలుస్తోంది. దీనికితోడు స్వామివారి ఆలయం చుట్టూ కడ్డీలతో గ్రిల్ ఉండటంతో వర్షం కురిసినప్పుడల్లా ఆలయంలోకి (ఒలిపిరి)వర్షం నీరు వస్తుండటంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇనుప గ్రిల్స్ ఉండటం విద్యుత్ వైర్లు చిందరవందరగా వేళాడుతుండటంతో భక్తులు భయాందోళనలకు గురవుతున్నారు.


ఇనుపగ్రిల్స్‌కు చెదురు మదురుగా వేలాడుతున్న విద్యుత్ తీగలు

నిధులు ఏమవుతున్నట్లు?

స్వామివారి జాతర సందర్భంగా టెంకాయలు, లడ్డూలు, కొబ్బరి చిప్పలు, హుండీలెక్కింపు, దర్శనం టికెట్ల తదితర వాటికి నిర్వహించే వేలాలతోపాటు హుండీ కానుకలు, మాన్యం భూముల వేలం ద్వారా ఏటా దాదాపు రూ.30 లక్షల ఆదాయం సమకూరుతుంది. వచ్చిన ఆదాయంతో స్వామి, అమ్మవార్ల ఆలయాల అభివృద్ధి చేపట్టాల్సి ఉండగా ఇప్పటిదాకా ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవటంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏటా వచ్చిన డబ్బంతా దేనికి ఖర్చు చేస్తున్నారో దేవదాయశాఖ అధికారులు, కమిటీ చైర్మన్లు వెల్లడించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 6 నుంచి 15వ తేదీ వరకు జాతర ఉత్సవాలు జరిగాయి. దాదాపు రెండు మాసాలైనా అధికారులు లెక్కలు తేల్చకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.


తర్తూరు లక్ష్మీరంగనాథస్వామి ఆలయ గాలిగోపురం

నిరుపయోగంగా మరుగుదొడ్లు



ఆలయ సమీపంలోని మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉండటంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అత్యవసరమైన సమయంలో మహిళా భక్తులు ఆలయ సమీపంలోని ఇళ్లల్లోని వారిని రిక్వెస్టు చేసుకుని అవసరాలు తీర్చుకునే పరిస్థితి దాపురించింది. ఆలయ కమిటీ చైర్మన్లు, ఈఓలు మారుతున్నప్పటికీ మరుగుదొడ్లను బాగు చేయించకపోవడంతో భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వామివారికి పుట్టు వెంట్రుకలు, తలనీలాలు సమర్పించిన భక్తులు స్నానాలు చేద్దామన్నా కుళాయిలు, స్నానాల గదుల్లేవు. దర్శనానంతరం కాసేపు సేదతీరుదామన్నా సత్రాల్లేవు. రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నా భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో పలువురు మండిపడుతున్నారు.

రథం.. కళావిహీనం..

స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా రథోత్సవం కార్యక్రమానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. 380 ఏళ్ల క్రితం ఎంతో అద్భుతంగా చెక్కతో తయారు చేయించిన తేరు రథశాలకు తలుపులు లేకపోవటంతో ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ కళావిహీనంగా తయారైంది. ఎంతో అద్భుతమైన స్వామివారి రథం శిథిలం కాకముందే రథశాలకు తలుపులు ఏర్పాటుచేసి స్వామివారి రథాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని భక్తులు పేర్కొంటున్నారు.

తరిగిపోయిన మాన్యం భూములు

తర్తూరు గ్రామానికి చెందిన రాజారెడ్డి వంశానికి చెందిన ఇంట్లో (గాడిపాడు) లక్ష్మీరంగనాథస్వామి 730ఏళ్ల క్రితం చెక్కబొమ్మ రూపంలో కొలువయ్యాడు. స్వామివారికి జాతర నిర్వహించేందుకు గాను రాజారెడ్డి వంశస్తులను ప్రధాన పూజారులుగా నియమించారు. వారితోపాటు నాయీ బ్రాహ్మణ, కమ్మరి, కుమ్మరి, చాకలి, మాదిగలు ఇలా ప్రతి కులం వారిని స్వామివారి సేవకులుగా నియమించి వారికి జీవనోపాధి నిమిత్తం 200 ఎకరాలను కేటాయించారు. కాలక్రమేణా ఆయకట్టు(సేవకులు)దారుల్లో కొంత మంది మృతిచెందడం, మరికొంత మంది గ్రామం విడిచిపోవటంతో భూములు కూడా క్రయ, విక్రయాలు జరిగాయి. దీంతో 200 ఎకరాల మాన్యం భూములు తరిగిపోయి ప్రస్తుతం 60 ఎకరాలు మాత్రమే మిగిలాయి. అందులో 31.16 ఎకరాల భూములు ఆలయ ప్రధాన అర్చకుల వద్ద ఉండగా మిగిలిన 28.84 ఎకరాల భూములు దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఉంది. వాటికి వేలాలు నిర్వహిస్తూ ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



ఆలయానికి ఏటా రూ.30లక్షల ఆదాయం వస్తుంది. ఆ డబ్బుతో అధికారులు, కమిటీ సభ్యులు ఏమి చేస్తున్నారో ఏమో. ఇప్పటి దాకా ఎలాంటి అభివృద్ధి లేదు. కనీసం భక్తులకు మరుగుదొడ్లు కూడా ఏర్పాటు చేయకపోవడం దారుణం. ఈ ఏడాది టెంకాయలు, లడ్డూ, కొబ్బరిచిప్పల వేలం, హుండీ కానుకలు, దర్శనం టికెట్ల ద్వారా రూ.20 లక్షల ఆదాయం సమకూరింది. ఆ డబ్బుతోనైనా భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించాలి.

– పూజారి చిన్నరంగస్వామి, తర్తూరు

ప్రతిపాదనలు పంపిస్తాం

ఆలయ అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి దేవదాయశాఖ డీఈకి పంపిస్తాం. వచ్చిన ఆదాయంతో ఏటా ఒక్కొక్కటిగా పనులు పూర్తిచేస్తాం. రథశాలకు డోర్లు, టాయ్‌లెట్ల మరమ్మతులు చేయిస్తాం.

– సాయికుమార్, ఈఓ, తర్తూరు ఆలయం

వ్యవసాయ అధికారుల సలహాలు పాటించాలి

ఆత్మకూరు: రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు పాటించాలని మండల వ్యవసాయ అధికారిణి హేమలత సూచించారు. ఆత్మకూరు, బాపనంతాపురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి కంది, మొక్కజొన్న పంటల్లో సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో పట్టు పరిశ్రమ టెక్నికల్ అసిస్టెంట్ కలాం, వ్యవసాయ విస్తరణాధికారులు లతమ్మ, సతీష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

గంధకం ఎరువులు వాడొద్దు

మహానంది: వరి పైరులో గంధకం కలిగి ఉన్న కాంప్లెక్స్ ఎరువులు అధికంగా వాడితే వేర్లు కుళ్లిపోయి మొక్కలు చనిపోతాయని వ్యవసాయ అధికారి నాగేశ్వర రెడ్డి తెలిపారు. బొల్లవరంలో నిర్వహించిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆయన రైతులకు పలు సూచనలు చేశారు.

- బండి ఆత్మకూరు: మేలైన యాజమాన్య పద్ధతులను పాటించి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి ఆర్ పవన్‌కుమార్ సూచించారు. మంగళవారం ఈర్నపాడు, కడమల కాలువ గ్రామాల్లో పొలంబడి కార్యక్రమం నిర్వహించి చీడపీడల నివారణపై రైతులకు సూచనలిచ్చారు.
- వెలుగోడు: అన్నదాత సుఖీభవ పథకం పొందేందుకు రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని ఏఓ స్వాతి సూచించారు. మంగళవారం మోతుకూరు, మాధవరం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆమె రైతులకు మట్టి నమూనాల పరీక్షలు, ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు.
- కొత్తపల్లి: ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగుచేసుకోవడం వల్ల మానవాళికి ఆరోగ్యం పదిలంగా ఉంటుందని మండల వ్యవసాయాధికారిణి అమీరున్నిసా బేగం సూచించారు. మంగళవారం గువ్వలకుంట్ల, కొత్తపల్లి గ్రామాల పొలాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈఓ నాగశ్రీ పాల్గొన్నారు.
- పాములపాడు: లైసెన్స్ డీలర్ల వద్దే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేయాలని మండల వ్యవసాయాధికారి మహేశ్వరరెడ్డి రైతులకు సూచించారు. మండల కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు సూచనలిచ్చారు.

షరతులు విధించొద్దు

ఆత్మకూరు: మున్సిపల్ కార్మికులకు షరతులు లేకుండా తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, పెద్ద నాగరాజు కోరారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి ధర్నా చేశారు. అనంతరం మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రషీద్, కమిషనర్ రమేష్‌బాబులకు వినతి పత్రం అందించారు. చాలీచాలని వేతనాలతో జీవితాన్ని నెట్టుకొస్తున్న వారికి పథకాలు దూరం చేయడం తగదన్నారు. ధర్నాలో మున్సిపల్ కార్మికులు తిమ్మయ్య, ప్రసాద్, గొడుగు రాజు, జయన్న, రాజేంద్ర, నాగన్న, రవి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

దళితవాడలో మౌలిక వసతులు కల్పించాలి

ఆత్మకూరు: దళితవాడలో మౌలిక వసతులు కల్పించాలని భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఎంసీపీఐ యూ) జిల్లా కన్వీనర్ పాతకోట లాజరస్ కోరారు. ఇంద్రానగర్ దళితవాడలో మంగళవారం ఆయన పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. సీసీ రోడ్లు నిర్మించాలని, నీటి పైపులు, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు మద్రిస్వామి, రాజు, కాలనీవాసులు, వెంకటేశ్వర్లు, ప్రసన్నకుమారి, మురహరి, సుశీలమ్మ, లక్ష్మమ్మ, రవణమ్మ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఫెస్టిసైడ్స్ దుకాణాలపై చర్యలు తీసుకోవాలి

ఆత్మకూరు: సీడ్స్, ఫెస్టిసైడ్స్ దుకాణాలు ధనార్జనే ధ్యేయంగా రోదులు తారుమారు చేస్తూ అధిక రేట్లకు విక్రయిస్తున్నారని, తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా నాయకులు రమేష్‌బాబు, ఆత్మకూరు తాలూకా కార్యదర్శి ప్రతాప్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, బయో మందులతో రైతులను మోసం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వీరనారాయణ, షేక్షావలి, దేవ, సయ్యద్, చాంద్, అబూబ్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

వెలుగోడు: బాల కార్మిక వ్యవస్థను సమష్టిగా నిర్మూలిద్దామని ఆత్మకూరు డివిజన్ సహాయ అధికారిణి మార్గరేట్, నంద్యాల సర్కిల్–3 కార్మిక అధికారి మురళీమోహన్ అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలో కార్మికశాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. షాపుల వెంట కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం జిల్లా కార్మిక అధికారి మురళీమోహన్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి బాల కార్మికులపై చైల్డ్ లేబర్ స్క్వాడ్ ఎంక్వయిరీ చేస్తున్నామన్నారు. బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే రూ.50 వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కోమలి, సంపత్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా నదిలో పడిన రోలర్

- చాకచక్యంతో కిందకు దూకి ప్రాణాలు కాపాడుకున్న డ్రైవర్

కొత్తపల్లి: రహదారి పనుల నిమిత్తం తరలిస్తున్న లారీకి బ్రేక్ ఫెయిల్ కావడంతో రోడ్డు రోలర్ కృష్ణానదిలో పడిన ఘటన మంగళవారం సాయంత్రం సంగమేశ్వరం సమీపంలో చోటుచేసుకుంది. బిలం కామాక్షమ్మ సమీపం నుంచి జనాల గూడెం వరకు మంజూరైన రోడ్డు పనుల నిమిత్తం వస్తున్న లారీ సంగమేశ్వరం నుంచి సిద్ధేశ్వరం వెళ్లే రహదారిలో బిలం కామాక్షమ్మ సమీపంలోని మలుపు వద్ద గుట్ట ఎక్కబోతున్నప్పుడు బ్రేక్ ఫెయిల్ కావడంతో రోడ్డు రోలర్ కృష్ణానదిలో పడగా లారీ నది ఒడ్డున పడింది. డ్రైవర్ చాకచక్యంతో కిందకు దూకి ప్రాణాలు కాపాడుకున్నాడు.

గోగ్రాసం విక్రయంలో గోల్‌మాల్?

మహానంది: మహానంది దేవస్థానంలోని ఆలయం వెనుక ఉన్న గోనివాసం(గోవులు ఉంచే చోటు) వద్ద గోగ్రాసం విక్రయాల్లో ఏజెన్సీ ఉద్యోగి తన చేతివాటాన్ని ప్రదర్శించినట్లు సోషల్ మీడియాలో కథనాలొచ్చాయి. ఆవులకు పెట్టే ఒక్కో గడ్డి కట్ట రూ.20కు విక్రయించాల్సి ఉండగా సుమారు 50 గడ్డి కట్టలకు టిక్కెట్లు ఇవ్వలేదని ప్రచారం సాగింది. ఈ విషయంపై ఈఓ శ్రీనివాసరెడ్డిని వివరణ కోరగా ఉద్యోగులు నిత్యం వివిధ కౌంటర్లలో తనిఖీలు చేస్తున్నారన్నారు. ఎలాంటి గోల్‌మాల్ జరగలేదన్నారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే శాశ్వతంగా ఇంటికి పంపిస్తామని హెచ్చరించారు.

ప్రజలకు చంద్రబాబు వెన్నుపోటు

శ్రీశైలంప్రాజెక్ట్: సూపర్ సిక్స్ హామీలతో ఓట్లు దండుకుని అధికారం చేపట్టిన తర్వాత వాటిని అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు వట్టి వెంకటరెడ్డి అన్నారు. వెన్నుపోటు పుస్తకాన్ని మంగళవారం సున్నిపెంటలోని పార్టీ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ తల్లికి వందనం పథకంలో ఎటువంటి షరతులుండవని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చి.. ఇప్పుడేమో అంగన్‌వాడీ, ఆశ వర్కర్లకు ఎగనామం పెట్టారని విమర్శించారు. నిరుద్యోగ భృతికోసం లక్షలాది మంది నిరుద్యోగులు, ఉచిత బస్సు ప్రయాణం కోసం, ఆడబిడ్డ నిధి కోసం మహిళలు ఎదురు చూస్తున్నారన్నారు. తక్షణమే హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గౌస్‌మొహిద్దీన్, కాంతారావు, సీహెచ్ పుల్లయ్య, ఆటో మల్లి, దమయంతి, మేరి పాల్గొన్నారు.


వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

పగిడ్యాల: ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ నిరంతర పోరాటం చేస్తుందని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు వి.రఘురాం మూర్తి, పట్టణ కార్యదర్శి ఎం.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం పడమర ప్రాతకోటలో మండల కార్యదర్శి అబ్దుల్ మజీద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అవలంబించే ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రజల పక్షాన గళం విప్పి ఐక్య పోరాటాలు చేస్తున్న ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ వచ్చే డిసెంబర్ 26 నాటికి వందేళ్లు పూర్తి చేసుకుంటుందన్నారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శి అబ్దుల్ కలాం, కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, యూసుఫ్, ఆకుల మాబాషా, హుస్సేనాలం, అచ్చన్న ఎన్నికైనట్లు జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రకటించారు.

బినామీ పేరుతో బిల్లు డ్రాపై విచారణ

నందికొట్కూరు: సచివాలయ భవనం బిల్లును బినామీ పేరుతో డ్రా చేసుకున్న ఘటనపై నంద్యాల డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు మంగళవారం విచారణ చేపట్టారు. మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలో 2020–21లో కాంట్రాక్టర్ వెంకటేశ్వర్లు సచివాలయ భవనాన్ని నిర్మించాడు. బిల్లు కోసం పలుమార్లు అప్పటి పంచాయతీ సెక్రటరీ, ప్రస్తుత ఎమ్మెల్యే జయసూర్య పర్సనల్ సెక్రటరీ పి.రవీంద్రబాబు, మండల పంచాయతీరాజ్ ఏఈ విజయభాస్కర్ (క్వాలిటీ కంట్రోల్ ఏఈ కర్నూలు)ను కాంట్రాక్టర్ కలిసి విన్నవించుకున్నా బిల్లు చేయకుండా నిర్లక్ష్యం చేశారు. ఇదే విషయమై కాంట్రాక్టర్ గత ఏడాది సెప్టెంబర్ 14న ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. సుమారు రూ.37 లక్షలను పీఎస్, ఏఈ ఇద్దరూ కలిసి బినామీ గొల్ల వెంకటేశ్వర్లు పేరుతో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఖాతా నంబర్ 00000032556486158 నుంచి విడతల వారీగా డ్రా చేసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఎల్‌పీఓ బిజినవేముల గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. పీఎస్, ఏఈలకు పలుమార్లు ఫోన్ చేసినా వారు స్పందించకపోవడంతో మధ్యాహ్నం 2.30 గంటల వరకు వేచి చూశారు. మరోవైపు తనకు న్యాయం చేయాలంటూ డీఎల్‌పీఓ ఎదుట కాంట్రాక్టర్ కంటతడి పెట్టుకున్నారు. అనంతరం డీఎల్‌డీఓ విలేకరులతో మాట్లాడుతూ పీఎస్, ఏఈలకు పలుమార్లు ఫోన్ చేసినా స్పందించలేదని, గ్రామస్తులను విచారించానని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని తెలిపారు.


విచారణ చేస్తున్న డీఎల్‌పీఓ రాంబాబు

రైతులు సంఘటితంగా వ్యాపారాలు నిర్వహించుకోవాలి


రైతులకు సలహాలు ఇస్తున్న నాబార్డ్ ఏజీఎం కేఆర్‌డీ కార్తీక్

నందికొట్కూరు: రైతులు సంఘటితంగా ఇన్‌పుట్, అవుట్ పుట్ వ్యాపారాలు హోల్‌సేల్‌గా నిర్వహించుకోవాలని నాబార్డ్ ఏజీఎం కేఆర్‌డీ కార్తీక్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం(ఎఫ్‌పీఓ) విజిట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రికల్చర్, ఆర్టికల్చర్, అనిమల్ హస్బెండరీ, అన్ని గవర్నమెంట్ డిపార్టుమెంట్ స్కీమ్స్ అందుబాటులోకి వచ్చే విధంగా సంఘం బోర్డు ఆఫ్ డైరెక్టర్స్, సీఈఓలు కృషి చేయాలన్నారు. అలాగే ఎఫ్‌పీఓ అభివృద్ధికి నాబార్డ్ అన్ని విధాలుగా సహకారం అందిస్తుందన్నారు. పీఏసీఎస్ సెక్రటరీ అశోక్ మాట్లాడుతూ త్వరలోనే ఎరువులు, పురుగు మందులు అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్స్ జయమ్మ, లక్ష్మినారాయణరెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

సంక్షిప్తం

23న కలెక్టరేట్ ఎదుట ధర్నా

నందికొట్కూరు: రైతు కూలీల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 23న జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహ తెలిపారు. మంగళవారం సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ కార్యాలయంలో ధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ధర్నాలో రైతులు, కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గోపాల్, రమణయ్యశెట్టి, మజీద్‌మియ్యా, ఎల్లనాయుడు, పుల్లన్న, శివ పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోండి

జూపాడుబంగ్లా: ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్న రైతులు రెండు రోజుల్లో చేయించుకోవాలని వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రైతుసేవా కేంద్రాలకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. లేకపోతే అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు ఖాతాలకు జమ కావన్నారు.

బాధ్యతల స్వీకరణ

పాములపాడు: డిప్యూటీ ఎంపీడీఓగా సులోచన మంగళవారం బాధ్యతలు చేపట్టారు. దొర్నిపాడు మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. పంచాయతీ కార్యదర్శులను ఆమె పరిచయం చేసుకున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణనే లక్ష్యం

నందికొట్కూరు: శాంతి భద్రతల పరిరక్షణనే తమ లక్ష్యమని రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున మిడుతూరు మండలం వీపనగడ్ల గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానిత వ్యక్తులు, రౌడీ షీటర్ల ఇళ్లలో సోదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించే ప్రసక్తే లేదన్నారు. యువత మంచి మార్గంలో నడిచి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. 21 క్వార్టర్ బాటిళ్లు, సరైన ధ్రువపత్రాలు లేని 9 మోటారు సైకిళ్లు, ఒక ఆటో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్‌ఐ ఓబులేసు ఉన్నారు.



వీపనగడ్లలో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ సుబ్రహ్మణ్యం

ఉద్యోగాలు ఇప్పిస్తామంటే నమ్మి మోసపోవద్దు


మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజి నాయక్

పాములపాడు: ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామంటే నమ్మి మోసపోవద్దని ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని లింగాలలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌గేమ్స్, ఆన్‌లైన్ లోన్ యాప్స్, ఓటీపీ, ఆన్‌లైన్ చెల్లింపులకు సంబంధించిన వాటిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనదారులు ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్ కుమార్ రెడ్డి, ఎస్‌ఐ సురేష్ బాబు పాల్గొన్నారు.

తప్పును చెరిపేసి.. ఒప్పును మరిచారు!



ఆత్మకూరు పట్టణ శివారులో 340సీ హైవే బైపాస్‌లో ఏర్పాటు చేసిన సూచిక బోర్డులో దొర్లిన తప్పును చెరిపేసిన అధికారులు ఒప్పును మాత్రం రాయడం మరిచిపోయారు. శ్రీశైలం దూరం 148 కి.మీ అని తప్పుగా రాయించడాన్ని మంగళవారం 'సాక్షి' ఎత్తి చూపుతూ ప్రచురించిన వార్తకు హైవే అధికారులు స్పందించారు. సూచిక బోర్డులోని 148 కి.మీ అక్షరాలపై పేపర్ ప్లేట్ అతికించి కనిపించకుండా చేసిన అధికారులు.. కచ్చితమైన దూరం ఎంత ఉందనే విషయాన్ని మాత్రం రాయించకుండా అలానే వదిలేశారు.

– ఆత్మకూరురూరల్